క్లుప్తంగా

గిరిజన పాఠశాలలకు మరమ్మతులు చేయాలి


మాట్లాడుతున్న జగదీశ్వర్

కెరమెరి: గిరిజన పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పనులను త్వరితగతిన ప్రారంభించాలని ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మండల సామాఖ్య భవనంలో వీవో అధ్యక్ష, కార్యదర్శులకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో (లోకల్ బాడి) విద్యుత్, మరుగుదొడ్లు, తాగునీరు, మైనర్ రిపేర్లు చేశామని, ఇక గిరిజన ప్రాథమిక పాఠశాల పనులను కూడా వీవో సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు, వీవో సభ్యులు ఉన్నారు.

5లోపు పూర్తి చేయాలి


యూనిఫామ్‌లను పరిశీలిస్తున్న ఏపీఎం

కెరమెరి: విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టడం ఈ నెల 5వ తేదీలోపు పూర్తి చేయాలని ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మోడి కుట్టు మిషన్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కుట్టిన యూనిఫామ్‌లను పరిశీలించారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు విద్యార్థుల యూనిఫామ్ కుట్టుపనిని అప్పగించిందన్నారు. గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలల యూనిఫామ్‌లను కూడా వీవో సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సీసీలు శ్యాంరావు, ధన్‌రాజ్, జీవన్ ఉన్నారు.

యూనిఫామ్‌లు పంపిణీ


యూనిఫామ్‌లను అందజేస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం విద్యార్థుల యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. ఇటీవల వచ్చిన యూనిఫామ్ దుస్తులను వీవో సంఘాల మహిళలకు కుట్టేందుకు అప్పగించగా.. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన యూనిఫామ్‌లు కుట్టడం పూర్తయింది. దీంతో ఆ పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌కు ఎంపీడీవో అంజద్‌పాషా చేతుల మీదుగా వీవో సభ్యులు యూనిఫామ్‌లు అందజేశారు. ఇప్పటికే మూడు పాఠశాలలకు చెందిన యూనిఫామ్‌లు కుట్టడం పూర్తయినట్లు సభ్యులు తెలిపారు. అడిషనల్ డీఆర్‌డీవో రామక్రిష్ణ, ఎంఎన్‌వో ఆడే ప్రకాశ్, ఏపీఎం జగదీశ్వర్, సీసీలు ఉన్నారు.

'శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలి'


మాట్లాడుతున్న ఇరిగిరాల భాస్కర్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణానికి చెందిన ఎస్సీ వైద్యురాలు నవ్యశ్రీని అవమానపర్చడమే కాకుండా తన కెరీర్‌ను దెబ్బతీస్తున్న సంజన్ ఆస్పత్రి (ఓల్డ్) నిర్వాహకుడు శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ సంఘాల మహా కూటమి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ ఇరిగిరాల భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని శ్రీషైన్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత సంజన ఆస్పత్రిలో బేదాభిప్రాయాలతో వచ్చిన సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాల్సిందిపోయి వ్యక్తిగతంగా ఆమెను కించపర్చడాన్ని ఖండిస్తున్నామన్నారు. శ్రీనివాస్, అతని అనుచరులతో తనకు ప్రాణహాని ఉందని వైద్యురాలు నవ్యశ్రీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ రాహుల్, నాయకులు శ్రీను, సురేశ్, నరేశ్, కుమార్, చక్రవర్తి, శ్రీనివాస్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొగాకు వ్యతిరేక దినోత్సవం

నార్నూర్: మండల కేంద్రంలోని పీహెచ్‌సీల ఆధ్వర్యంలో శుక్రవారం పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన జాతి నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామి కావాలన్నారు. పొగాకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. హెచ్‌ఈ నాందేవ్ చౌహాన్, సూపర్‌వైజర్ సత్తవ్వ, రాజమ్మ, ఏఎన్‌ఎంలు సుశీల పాల్గొన్నారు.

ఈసారైనా రుణమాఫీ అయ్యేనా?

- నిరాశలో గతంలో రుణమాఫీ కాని రైతులు
- కారణం తెలియక సతమతం
- ఆగస్టు 15లోపు రుణమాఫీ ప్రకటనపై ఆశలు
- రుణాల పంపిణీలోనూ నెరవేరని లక్ష్యం


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న రుణమాఫీ కాని రైతులు (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: గత ప్రభుత్వం 2018 ఎన్నికల సందర్భంగా రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చింది. ఆ మేరకు రూ.లక్ష లోపు రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీని వివిధ దశల్లో అమలు చేసింది. కానీ వివిధ కారణలతో జిల్లాలో మొత్తం 5531 మంది రైతులకు రుణమాఫీ జరగలేదు. దీంతో రుణాలు తీసుకున్న రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. తీసుకున్న రుణాలు వడ్డీతో కలిపి ఎక్కువ కావడంతో రైతులు కట్టలేక రుణాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. మరోవైపు జిల్లాలో పంట రుణాలు లక్ష్యం మేరకు పంపిణీ చేయడం లేదు. ఏటా రుణ లక్ష్యాన్ని పెంచి ప్రణాళిక విడుదల చేస్తున్న బ్యాంకర్లు పూర్తిస్థాయిలో ఇవ్వడంలో విఫలమవుతున్నారు. 2022 -23 సంవత్సరం డిసెంబర్ 31 వరకు పంట రుణ లక్ష్యం 58.4 శాతానికి మాత్రమే చేరింది. 2022 -23 ఆర్థిక సంవత్సరంలో పంట రుణ లక్ష్యం రూ.1,519.4 కోట్లు కాగా డిసెంబర్, 2023 వరకు రూ.8,66.3 కోట్లు పంపిణీ చేశారు.

5531 రైతులకు పెండింగ్..

జిల్లాలో 5వేలకు పైగా రైతులకు రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. గత ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ అర్హుల్లో 38,201 మందికి రూ.199.32 కోట్లు జమ చేసింది. కానీ వివిధ కారణాలతో జిల్లాలో మొత్తం 5531 మంది రైతులకు గాను రూ.25 కోట్ల వరకు రుణమాఫీ జరగలేదు. రైతులు నిత్యం రుణమాఫీ వివరాలు తెలుసుకునేందుకు బ్యాంకుకు వెళ్తే బ్యాంకు అధికారులు అకౌంట్ చెక్‌చేసి రాలేదని చెబుతున్నారు. రూ.లక్షలోపు రుణం తీసుకున్నా ఎందుకు రాలేదని ప్రశ్నిస్తే వారి నుంచి తెలియదనే సమాధానమే వస్తోంది. దీంతో రైతులు బ్యాంకుకు వచ్చి నిరాశగా వెనుదిరుగుతున్నారు. కాగా కొత్త రుణం కావాలంటే పాత రుణం చెల్లించాల్సిందేనని బ్యాంకు అధికారులు చెబుతుండడంతో రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా పలు టెక్నికల్ సమస్యలు ఉన్న రైతుల వద్ద నుంచి పరిష్కారానికి దరఖాస్తులు స్వీకరించినా వారికి కూడా ఇప్పటివరకు రుణమాఫీ కాలేదు. అసలు రుణమాఫీ డబ్బులు వస్తాయా లేదా అని తెలియని పరిస్థితి నెలకొంది. రుణమాఫీ కాని రైతులు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకున్నారు. ప్రస్తుతం వారంతా కొత్త ప్రభుత్వంపై గంపెడు ఆశలతో ఉన్నారు.

వడ్డీ రూ.50 వేలు అయింది



2018లో రూ. 80వేలు రుణం తీసుకున్నా. ఇప్పటి వరకు రూ.80 వేలకు వడ్డీ రూ.50 వేలు అయింది. మిగతా డబ్బులు కూడా ఇవ్వకుండా ఈ సంవత్సరం రూ. 30వేలు మళ్లీ రుణం ఇచ్చినట్లు రాసి ఇచ్చారు. రుణం ఎక్కువ అడిగినా ఇవ్వడం లేదు. వడ్డీ కూడ మాఫీ చేయాలి.

- సత్తయ్య, బూర్గుడ

రూ. 60వేలు రుణం తీసుకున్నా..



నేను 2016 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రుణం తీసుకుంటున్నాను. 2018లో రూ.60 వేలు రుణం తీసుకున్నా. కానీ నాకు రుణమాఫీ కాలేదు. దీంతో వడ్డీతో కలిపి కట్టి మళ్లీ రెన్యూవల్ చేసుకున్నా. ఈ సారైనా రుణమాఫీ చేయాలి.

- కిరణ్, రైతు

మాఫీ చేయాలి



గతంలో తీసుకున్న రూ. 96 వేలు రుణం మాఫీ కాలేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే మీ ఆధార్‌కార్డు నెంబర్‌పై మరో వ్యక్తి పేరు ఉంది అంటున్నారు. వ్యవసాయ అధికారులకు అన్ని పత్రాలు సమర్పించాం. వడ్డీ కట్టి మళ్లీ రూ.లక్ష తీసుకున్నా. ఈసారైనా ప్రభుత్వం మాఫీ చేయాలి.

- బుదాజీ, సాలేగూడ

నేడు 'ఉపాధి' ప్రజావేదిక

- ముగిసిన సామాజిక తనిఖీలు
- తేటతెల్లం కానున్న 492 పనులు
- ఏడాదిలో ఖర్చు చేసింది రూ.7.86 లక్షలు
- కూలీల భాగస్వామ్యం లేకుండానే కార్యక్రమం


కెరమెరిలో క్షేత్రస్థాయిలో కొలతలు తీసుకుంటున్న తనిఖీ సభ్యులు

కెరమెరి: గడిచిన కొన్ని రోజులుగా మండలంలోని 31 గ్రామపంచాయతీల్లో కొనసాగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీలు, గ్రామ సభలు శుక్రవారం ముగిశాయి. దీంతో నేడు శనివారం ఉదయం 10 గంటలకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో 12వ విడత 'ప్రజావేదిక' నిర్వహించనున్నారు. 24వ తేదీ వరకు దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో క్షేత్రస్థాయిలో చేసిన పనులు, పనుల కొలతలు తీసుకోవడం పూర్తికాగా, 25 నుంచి వివిధ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో గ్రామ సభలు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో క్షుప్తంగా పనులను పరిశీలించిన అనంతరం గ్రామసభల్లో రికార్డులను తనిఖీ చేశారు.

కూలీలు లేకుండానే..

పార్లమెంట్ ఎన్నికలు ముగిసినప్పటికీ ఈ నెల 4 వరకు ఎన్నికల నియమావళి అమల్లో ఉండడంతో గ్రామసభల్లో ప్రజలను భాగస్వాములు చేసే అవకాశం లేదు. కాగా నేడు నిర్వహించే ప్రజావేదికలో కూడా ప్రజలు హాజరు కారని అధికారులు చెబుతున్నారు. దీంతో తనిఖీ బృందం, ఉపాధిహామీ సిబ్బందితో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులతోనే ప్రజావేదిక కొనసాగనుంది. దీంతో ఏ కూలీకి.. ఏ కష్టం ఉందో చెప్పుకునే అవకాశం లేకుండా పోయింది. కాగా ఇంత హడావిడి చేసి ఎన్నికల నియమావళి అమలులో ఉన్న సమయంలోనే సామాజిక తనిఖీ, ప్రజావేదికలు ఎందుకు నిర్వహించాల్సి వస్తుందోనని కూలీలు చర్చించుకుంటున్నారు. 1, ఏప్రిల్, 2023 నుంచి 31, మార్చి, 2024 వరకు వివిధ రకాల 492 పనులు చేశారు. దీనికి మెటీరియల్‌తో పాటు కూలీలకు వేతనాలు రూ.7,86,68,046లను అందజేశారు. మండలంలో మొత్తం జాబ్‌కార్డులు 9,981 ఉండగా.. 18,399 మంది కూలీలు ఉన్నారు. అందులో యాక్టివ్ జాబ్‌కార్డులు 8002 ఉండగా.. 13,974 మంది కూలీలు యాక్టివ్‌గా ఉన్నారు. రోజూ సరైన విధంగా పని చేస్తే కూలీకి రూ.272 ప్రభుత్వం చెల్లిస్తుండగా.. రోజు కూలీ సరాసరి రూ. 220 సంపాదించాడు. కాగా వంద రోజులు పూర్తి చేసిన కూలీలు 300 మంది మాత్రమే ఉన్నారు. సామాజిక తనిఖీ బృందంలో ఎస్‌ఆర్‌పీ ఒక్కరు ఉండగా.. డీఆర్‌పీలు 12, వీఎస్‌ఏలు 24 మంది ఉన్నారు.

నిష్పక్షపాతంగా నిర్వహిస్తాం



నేడు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించే ప్రజావేదికను సామరస్యంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు కృషి చేస్తాం. గడిచిన పక్షం రోజులు ఉపాధిలో చేసిన పనుల వద్దకు సామాజిక తనిఖీ బృందం వెళ్లి పనులను పరిశీలించి కొలతలు తీసుకుంది. వారు నమోదు చేసిన లెక్కలు, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులపై ప్రజావేదిక జరుగనుంది.

- మల్లయ్య, ఈజీఎస్ ఏపీవో

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


బెజ్జూర్: విత్తనాలను పరిశీలిస్తున్న టీమ్


కౌటాల: రిజిష్టర్ పరిశీలిస్తున్న జిల్లా అధికారి

బెజ్జూర్: రైతులకు నకిలీ పత్తివిత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఏడీఏ రాజుల నాయుడు హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండలస్థాయి స్క్వాడ్ టీమ్స్ అగ్రికల్చర్, రెవెన్యూ, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని విత్తన దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విత్తన డీలర్లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ భౌమేశ్వర్, ఏఈవో రవితేజ, ఆనంద్ పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ జ్యోత్స్న, ఏవో మంజుల హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను శుక్రవారం రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ ప్రేం కిరణ్, ఏఈవో రాకేశ్ పాల్గొన్నారు.

కెరమెరి: నకిలీ విత్తనాలు కొనకూడదని ఏఈవో అఖిల్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండలంలోని నాగల్‌గొంధిలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. లైసెన్స్ ఉన్న విత్తన డీలర్ల వద్దే కొనే విత్తనాలకు రశీదు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పంటల్లో దిగుబడి వచ్చి పంటను విక్రయించే వరకు రశీదును భద్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

కౌటాల: విత్తన డీలర్లు తప్పనిసరిగా విత్తన చట్టం 1966 నిబంధనలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ముత్తంపేట గ్రామంలో ఫర్టిలైజర్ దుకాణాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. పలు రిజిష్టర్లను ఆయన పరిశీలించారు. ఏవో రాజేశ్ ఉన్నారు.

కౌటాల: పత్తి విత్తనాలు కొనుగోలు చేసే విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈవో చౌదరి అంజన్న అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామంలో పత్తి విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు.


కెరమెరి: మాట్లాడుతున్న ఏఈవో

ఏరియా ఉత్తమ ఉద్యోగుల ఎంపిక


నవనీత


మేకల స్వామి

రెబ్బెన: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఉత్తమ ఉద్యోగులను ప్రభుత్వం సన్మానించనుంది. ఈనేపథ్యంలో ఏరియాలో ఎంపికైన ఉత్తమ ఉద్యోగుల జాబితాను శుక్రవారం ఏరియా అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చటంతో కార్పొరేట్ స్థాయిలో ఏరియా సీనియర్ ఎస్టేట్స్ అధికారిణి నవనీత ఎంపిక కాగా, ఏరియా స్థాయిలో ఖైరిగూడ ఓసీపీలో ఈపీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న మేకల స్వామిని ఎంపిక చేసినట్లు ఏరియా అధికారులు ప్రకటించారు. ఎంపికైన ఉత్తమ ఉద్యోగులను ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో ఘనంగా సన్మానించనున్నారు.

'బడిబాట' విజయవంతానికి సహకరించాలి


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీవో రామకృష్ణ

కెరమెరి: పాఠశాల నిర్వహణ, అభివృద్ధిలో వీవో సభ్యుల పాత్ర కీలకం కానుందని అడిషనల్ డీఆర్‌డీవో రామకృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బడిబాట కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దాదాపు 6000 మంది ఒకటో తరగతిలో చేరే వారున్నారని పేర్కొన్నారు. వారందనీ ప్రభుత్వ బడుల్లో చేర్పించాలన్నారు. ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తు ప్రసాద్, ఎంఎన్‌వో ప్రకాశ్, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్, ఏపీఎం జగదీశ్వర్, ఎస్సీఆర్‌పీ నరేశ్, ఏఎస్సై బాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: జూన్ 3వ తేదీ నుంచి నిర్వహించనున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని ఎంఈవో వెంకటేశ్వర స్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండల సమాఖ్య, మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడిబాట కార్యక్రమంలో భాగంగా బడీడు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సహకరించాలన్నారు. ఎంపీడీవో శంకరమ్మ, ఏపీఎం వెంకటరమణ శర్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు అమృత, నంబాల జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం పురుషోత్తం, వీవో అధ్యక్షులు, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు హాజరయ్యారు.

వాంకిడి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం బడిబాట కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వరలక్ష్మి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ రోహిత్, ఎంపీవో ఖాజా జిజాజుద్దీన్, ఎంఈవో మనుకుమార్, ఏపీఎం మహేశ్ పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని ఆయా గ్రామాలలో మండల సమాఖ్య, ఐకేపీల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఐకేపీ ఉద్యోగులు, సభ్యులు, పంచాయతీ కార్యదర్శులకు బడిబాటలో భాగంగా నిర్వహించాల్సిన కార్యచరణ వివరించారు. పాఠశాలల్లో పిల్లలను చేర్పించడం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు రూపరాణి పాల్గొన్నారు.

దహెగాం: బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని యూడీసీ బంక నాగేశ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీలు, సహాయక సంఘాల సభ్యులకు బడిబాట కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

'అండగా నిలిచిన వారిపై ఆరోపణలు సరికాదు'


సమావేశంలో మాట్లాడుతున్న బాధిత రైతులు

రెబ్బెన: తుంగెడ శివారులో ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు రైతులకు న్యాయం చేయాలని అండగా నిలిచిన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు, మండల నాయకుడు హరీశ్‌పై నిరాధారణమైన ఆరోపణలు చేయడం సరికాదని బాధిత రైతులు అన్నారు. శుక్రవారం తుంగెడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తుంగెడ శివారులో సుమారు 42 ఎకరాలను గ్రామానికి చెందిన 21 మంది ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నామన్నారు. కొన్ని కారణాలతో కొంత కాలంగా సాగు చేయకపోవటంతో పొదలు మొలిచాయని, ప్రస్తుతం తిరిగి సాగు పనులు చేపట్టేందుకు వెళ్తే ఫారెస్టు అధికారులు అడ్డుపడ్డారన్నారు. ఈ క్రమంలో తమకు అండగా నిలిచిన నాయకులపై కొంత మంది అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రైతులు పెంటుబాయి, భీమక్క, రాజుబాయి, గంగుబాయి, భూమక్క, లస్మక్క, లచ్చయ్య, పార్వతి, పోశం పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు రైతులు సన్నద్ధం

- ముందస్తు నైరుతితో రైతన్నల ఆశలు
- ఈసారి సైతం పత్తి సాగుకే మొగ్గు
- కానరాని సబ్సిడీ ఎరువులు, విత్తనాలు
- పంటలపై అవగాహన కరువు


లింగాపూర్‌లో ఖరీఫ్ పంట సాగుకు సిద్ధమవుతున్న రైతులు

లింగాపూర్: వాతావరణ శాఖ ముందస్తుగా నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉందని తెలుపడంతో మండలంలోని రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. ట్రాక్టర్లు, ఎడ్ల ద్వారా దుక్కులు దున్నుకొని చదును చేసే పనిలో అన్నదాతలు నిమగ్నమయ్యారు. రోహిణి కార్తె ప్రారంభం కావడంతో విత్తనాలు విత్తుకునేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు. కాడెద్దులు ఉన్న రైతులు వాటితో భూములను చదును చేస్తుండగా, ఎడ్లు లేని వారు ట్రాక్టర్లతో చదును చేసే పనులలో మునిగిపోయారు.

పత్తి సాగుకు మొగ్గు?

గత ఏడాది మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని సాగు భూమిలో 80శాతం వరకు పత్తి పంట సాగు చేశారు. ప్రస్తుత ఏడాది కూడా రైతులు పత్తి పంట సాగుకే మొగ్గు చూపే అవకాశం ఉంది. ఖరీఫ్‌లో పత్తి కాకుండా ఇతర పంటలు సాగు చేస్తే అడవి పందుల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో పత్తి పంట సాగుకే రైతులు ఏటా ఆసక్తి చూపుతున్నారు. గత సంవత్సరం మండలంలో 16,059 ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా సోయాబీన్ 2600 ఎకరాలు, కందులు 4265 ఎకరాలు, జొన్న పంట 1230 ఎకరాల్లో సాగు చేశారు. ఈసారి వర్షపాతం ఎక్కువగా నమోదైతే పత్తి పంట సాగు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాగా మండలంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు రైతులకు ఇంతవరకు అందుబాటులోకి రాలేదు. జిల్లాలోని ఇతర మండలాల్లో అందుబాటులో ఉన్న సబ్సిడీ విత్తనాలు, ఎరువులు లింగాపూర్ మండలంలో లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నకిలీ బెడద

రైతులు సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో దళారులు, అక్రమార్కులు నకిలీ పత్తి విత్తనాలను రైతులకు అంటగట్టే ప్రమాదం ఉంది. వారిని అడ్డుకొని నకిలీ విత్తనాలు రాకుండా అధికారులు చూడాలని మండలరైతులు కోరుతున్నారు. అధికారులు పంటల సాగుపై లింగాపూర్ క్లస్టర్‌లో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

అవగాహన కల్పించాలి



వ్యవసాయాధికారులు నకిలీ విత్తనాలు, పంటల సాగుపై అవగాహన కల్పించాలి. ఖరీఫ్ పంటల సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో సబ్సిడీ విత్తనాలు ఇంకా అందుబాటులోకి రాకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుంది.

- జాదవ్ అశోక్ నాయక్, లింగాపూర్

నిత్యావసర సరుకులు అందజేత

సాక్షి ఎఫెక్ట్..


సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

కౌటాల: మండలంలోని పార్డీ గ్రామానికి చెందిన ముగ్గురు అనాథ పిల్లలకు శుక్రవారం పలువురు దాతలు నిత్యావసర సరుకులు అందజేశారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు బియ్యం, పప్పులు, వంట నూనె, ఇతర సామగ్రి పంపిణీ చేశారు. ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన 'ఆపన్న హస్తం కోసం ఎదురుచూపులు' అనే కథనానికి స్పందించి సాయం చేసినట్లు వారు తెలిపారు. కొండపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఉపసే సంజీవ్ బాధిత పిల్లలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దొబ్బల మంగేశ్, యువకులు సాయినాథ్, గోపాల్, వెంకటేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: మండలంలోని అర్కగూడ గ్రామానికి చెందిన ఆత్రం మహేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆదేశాల మేరకు శుక్రవారం పార్టీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. 50కిలోల బియ్యంతో పాటు రూ.2వేల ఆర్థిక సహాయాన్ని మృతుడి భార్య భార్య సరితకు అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, మండల అధ్యక్షుడు శంకర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజారామ్, అబ్దుల్ హకీమ్, వినోద్, అమృత, గంగారాం, మంగయ్య, ధర్మయ్య, వెంకటి, వీరయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.